# స్వరాష్ట్రంలోనే అడవుల వృద్ధి



అంబారిపేట అర్బన్ ఫారెస్ట్‌లో శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సంజయ్ కుమార్

- **సీఎం కేసీఆర్ ముందుచూపుతోనే విస్తీర్ణం పెరిగింది**
- **జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్**
- **అర్బన్ ఫారెస్ట్ పార్కులో అభివృద్ధి పనులకు శంకుస్థాపన**

జగిత్యాల, అక్టోబర్ 7: సీఎం కేసీఆర్ ముందు చూపుతో రాష్ట్రంలో అటవీ విస్తీర్ణ శాతం పెరిగిందని ఎమ్మెల్యే సంజయ్ కుమార్ పేర్కొన్నారు. జగిత్యాల అర్బన్ మండలం అంబారిపేట్ శివారులో ₹2కోట్లతో చేపట్టిన అర్బన్ ఫారెస్ట్ పార్క్ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, జగిత్యాల జిల్లా కేంద్రానికి అతి దగ్గరగా ఉన్న అడవి అంబారిపేట ఫారెస్ట్ అన్నారు. రాష్ట్రంలో ఫారెస్ట్ యూనివర్సిటీ ఏర్పాటు చేసిన ఘనత కేసీఆర్‌దన్నారు. హరిత హారంలో మొక్కలు నాటి పచ్చదనానికి, అడవుల అభివృద్ధికి కృషి చేశామన్నారు. గ్రామస్తులు, అధికారుల సహకారంతో గ్రామంలో ఒక చిన్న చెరువు ఏర్పాటు శామని, అది నేడు అందంగా, ఆహ్లాదకరంగా తయారైందని చెప్పారు. జగిత్యాల పట్టణ పరిసర ప్రజలు ఒకసారి అర్బన్ పార్క్ వీక్షించాలని, 40వేల మొక్కలు నాటినట్లు చెప్పారు. ఇక్కడి నుంచి పట్టణాన్ని వీక్షించేలా వాచ్ టవర్‌ను నిర్మిస్తున్నట్లు చెప్పారు. మిషన్ కాకతీయను కాపీ చేసి కేంద్రం అమృత్ సరోవర్ చేపట్టిందని, ఈ పథకం కింద కేంద్రం ద్వారా నిధులు వచ్చేలా అధికారులు కృషి చేయాలన్నారు. ఇక్కడ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ దివాకర్, డీఎఫ్ఓ వెంకటేశ్వర్ రావు, సర్పంచ్ గంగాధర్, మున్సిపల్ చైర్మన్ గోలి శ్రీనివాస్, ఎంపీటీసీ మల్లారెడ్డి, ఎఫ్ఆర్‌వోలు ప్రణీత్ కౌర్, అరుణ్ కుమార్, ఎఫ్‌బీవో ఫిరోజ్, ఎంపీడీవో శైలజ రాణి, ఉప సర్పంచ్ నారాయణ, గ్రామ శాఖ మల్లేశం, ఆర్బీఎస్ సభ్యుడు వెంకటేశ్ ఉన్నారు.

# బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి, సంక్షేమం



బీఆర్ఎస్‌లో చేరుతున్న కాంగ్రెస్, బీజేపీ నాయకులతో ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ లక్ష్మీనర్సింహారావు

- **వేములవాడ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనర్సింహారావు**
- **పార్టీలోకి 200 మంది గౌడ సంఘం నాయకుల చేరిక**

వేములవాడ, ఆక్టోబర్ 7: బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని, సీఎం కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నదని వేములవాడ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనర్సింహారావు పేర్కొన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, అమలవుతున్న పథకాలకు మెచ్చే వివిధ పార్టీల నాయకులు బీఆర్ఎస్‌లో చేరుతున్నారని చెప్పారు. శనివారం వేములవాడ పట్టణంలోని చల్మెడ నివాసలో పట్టణంలోని గౌడ సంఘం పట్టణ అధ్యక్షుడు, కాంగ్రెస్ సీనియర్ నేత నెరెళ్ల శ్రీధర్‌గౌడ్, బీజేపీ సీనియర్ నాయకుడు గజ్జెల రమేశ్‌తో పాటు సుమారు 200 మంది గౌడ సంఘం నాయకులు పార్టీలో చేరగా కండువా కప్పి ఆహ్వానించారు. అనంతరం చల్మెడ మాట్లాడుతూ, కేసీఆర్ వెంటే తాము ఉంటామని, తెలంగాణ అభివృద్ధి సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌తోనే సాధ్యమన్నారు. రాబోయే రోజుల్లో గౌడ కులస్తులకు అన్ని విధాలా అండగా ఉంటామని, వారి సమస్యలన్నీ పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య మాజీ జడ్పీవైస్ చైర్మన్ తీగల రవీందర్‌గౌడ్, గజ్జెల శ్రీనివాస్, నేరెళ్ల నారాయణ, పూదరి మురళి, గట్టయ్య, రవి, బైరగోని అంజయ్య, బుర్ర లక్ష్మీరాజం పాల్గొన్నారు.

# టెంపుల్ సిటీగా కరీంనగర్



ఉజ్వల పార్కు వద్ద ఇస్కాన్ టెంపుల్‌కు భూమిపూజ చేసి ప్రారంభిస్తున్న మంత్రి గంగుల కమలాకర్, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్, మేయర్, తదితరులు

- **ఇది చరిత్రలో నిలిచిపోయే రోజు**
- **మంత్రి గంగుల కమలాకర్**
- **పర్యాటకంగా ఎంతో ప్రగతి**
- **రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్**

కమాన్‌చౌరస్తా, అక్టోబర్ 7 : టెంపుల్ సిటీగా కరీంనగర్ జిల్లా కేంద్రం ఎంతో అభివృద్ధి చెందుతున్నదని, ఇటు అభివృద్ధితో పాటు ఆధ్యాత్మికలో నగరం శాంతి, సౌభాగ్యాలతో వెలుగొందనున్నదని రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ స్పష్టం చేశారు. ఇస్కాన్ ఆధ్వర్యంలో కరీంనగర్ జిల్లా కేంద్రంలోని బైపాస్ రోడ్డు పోలీస్ ట్రైనింగ్ సెంటర్ ఎదురుగా ఇస్కాన్ ఆధ్వర్యంలో నిర్మించనున్న రాధాకృష్ణుల ఆలయానికి శిలాఫలక ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయన రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్ కుమార్, మేయర్ వై సునీల్‌రావు, కలెక్టర్ డాక్టర్ గోపి, ఇస్కాన్ బాధ్యులు నరహరి ప్రభుతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. మనం చాలా దేవాలయాలకు వెళ్లామని, దేవళ్లకు పూజలు చేస్తాం కానీ, ఆ దేవాలయం ఎప్పుడు నిర్మించారో ఎవరికీ తెలియదన్నారు. కానీ, జిల్లా కేంద్రంలో నిర్మిస్తున్న ఇస్కాన్ రాధా శ్రీకృష్ణ మందిర పునాది రాయి వేయడంలో భాగస్వాములమైన, మనమంతా చరిత్రలో నిలువనున్నామన్నారు. కరీంనగర్ ఒక టెంపుల్ సిటీగా మారనున్నదన్నారు. ఒక వైపు రేకుర్తిలో శంకుచక్రాలతో వెలిసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయం, మరో వైపు తిరుమల తిరుపతి దేవస్థానం, మరోవైపు రాధాశ్రీకృష్ణస్వామి ఆలయం కొలువుదీరనున్నాయన్నారు. ఈ రాధాకృష్ణ మందిరం హైదరాబాద్ తర్వాత కరీంనగర్‌లో దాదాపు మూడెకరాల స్థలంలో రూ.25 కోట్లతో నిర్మాణం జరగనున్నదన్నారు. అక్టోబర్ 6నే తిరుమల తిరుపతి దేవస్థానానికి టెండర్లు పూర్తయ్యాయని, త్వరలోనే నిర్మాణ పనులు ప్రారంభమవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ వై సునీల్‌రావు, ఇస్కాన్ బాధ్యులు నరహరి ప్రభు, ఆలయ నిర్మాణ బాధ్యులు డాక్టర్ రాజభాస్కర్ రెడ్డి మాట్లాడగా, రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గెల్లు శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ చల్లా స్వరూపారాణి హరిశంకర్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ పొన్నం అనిల్‌కుమార్ గౌడ్, రాష్ట్ర చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు గౌరిశెట్టి మునీందర్, డాక్టర్ బుర్ర మధుసూధన్ రెడ్డి, కోమళ్ల రాజేందర్‌రెడ్డి, మందల నగేశ్‌రెడ్డి, తుమ్మల రమేశ్‌రెడ్డి, రాజిరెడ్డి, కార్పొరేటర్ ఐలేందర్ యాదవ్ పాల్గొన్నారు.

### పర్యాటకంగా ఎంతో ప్రగతి

ఇస్కాన్ ఆధ్వర్యంలో నిర్మించనున్న రాధాశ్రీకృష్ణ మందిరంతో ఒక ఆధ్యాత్మిక వాతావరణం ఏర్పడుతుంది. సేవా భావం పెంపొందేలా ప్రోత్సహించే సంస్థ ఇస్కాన్. వాళ్ల ఆధ్వర్యంలో అక్షయ పాత్ర ద్వారా ఇప్పటికే నగరాల్లో అతితక్కువ ఖర్చుతో మధ్యాహ్న భోజనం అందిస్తున్నారు. కరీంనగర్ రివర్‌ఫ్రంట్ సమీపంలో నిర్మిస్తున్న ఈ ఆలయంతో నగరం పర్యాటకంతో పాటు ఆధ్యాత్మిక నగరంగా అభివృద్ధి సాధిస్తుంది. తిరుమల తిరుపతి దేవస్థానం నిర్మాణం మూడు నెలలైనా పూర్తి కాలేదని పలువురు మాట్లాడడం సరికాదు. అది కాంక్రీట్ సిమెంట్‌తో నిర్మించే ఆలయం కాదు. తమిళనాడులోని శిల్పులతో నిర్మాణాలు తయారు చేయించి, సంస్కృతి ఉట్టిపడేలా ఆలయ నిర్మాణం చేపడుతాం. సీఎం కేసీఆర్ సహకారంతోనే నగరంలో ఇంతలా అభివృద్ధి చెందుతున్నది. దీనికి పూర్తి స్థాయిలో మంత్రి గంగుల ఆలోచనా విధానం ఎంతో సహకరిస్తున్నది.

**- బోయినపల్లి వినోద్‌కుమార్, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు**

# ఆశీర్వదించండి.. అభివృద్ధి చేస్తా..

- **ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి**
- **మున్సిపల్ కార్యాలయం, మినీ ట్యాంక్ బండ్ ప్రారంభం**

పెద్దపల్లి కమాన్, అక్టోబర్ 7 : వచ్చే ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి మరోసారి ఆశీర్వదిస్తే.. పెద్దపల్లిని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి చూపిస్తానని ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి హామీ ఇచ్చారు. శనివారం రాత్రి పెద్దపల్లి మున్సిపల్ కార్యాలయ భవనంతోపాటు మినీ ట్యాంక్‌బండ్‌ను కలెక్టర్ ముజామ్మిల్‌ఖాన్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడ్డాక పెద్దపల్లి పట్టణం అన్ని విధాలా అభివృద్ధి చెందిందన్నారు. రాబోయే రోజుల్లో మరింత అభివృద్ధి చేస్తామన్నారు. సీఎం కేసీఆర్ నియోజకవర్గ, పట్టణ అభివృద్ధి కోసం రూ.వందల కోట్ల నిధులు మంజూరు చేశారని గుర్తు చేశారు. గత పాలకుల పాలనలో కుంటుపడిన అభివృద్ధి ప్రత్యేక రాష్ట్రం ఏర్పడ్డాక వందశాతం అభివృద్ధి పథంలో దూసుకుపోతుందన్నారు. అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తున్న సీఎం కేసీఆర్‌కు, తెలంగాణ ప్రభుత్వానికి పట్టణ ప్రజలు రుణపడి ఉండాలని కోరారు. కలెక్టర్ ముజామిల్ ఖాన్ మాట్లాడుతూ.. పెద్దపల్లి పట్టణాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దేందుకు అన్ని విధాలా సహకారం అందిస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పట్టణాభివృద్ధికి ఇప్పటికే నిధులు కేటాయించిందన్నారు. ఎమ్మెల్యే, అధికారుల సహకారంతో పట్టణాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ మమతా రెడ్డి, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్, కౌన్సిలర్లు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



మినీ ట్యాంక్‌బండ్‌ను ప్రారంభించి బోట్‌లో వెళ్తున్న ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి, కలెక్టర్ ముజామ్మిల్‌ఖాన్



తృతీయ స్థానం సాధించిన కరీంనగర్ రీజియన్ టీంతో ఎండీ సజ్జనార్

# ఆర్టీసీ కరీంనగర్ రీజియన్‌కు తృతీయ స్థానం

తెలంగాణచౌక్, అక్టోబర్ 7: ఆర్టీసీలో రాఖీ శ్రావణ మాసం చాలెంజ్‌లో ఆర్టీసీ కరీంనగర్ రీజియన్‌కు రాష్ట్రంలోనే తృతీయ స్థానం లభించింది. ప్రథమస్థానం వరంగల్ నిలువగా, ద్వితీయ స్థానంలో నల్గొండ రీజియన్ నిలిచింది. హైదరాబాద్ ఆర్టీసీ కళాభవనంలో శనివారం ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో సంస్థ వైస్ చైర్మన్, ఎండీ సజ్జనార్ చేతుల మీదుగా కరీంనగర్‌జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వినోద్‌కుమార్, ఆర్ఎం సుచరిత ₹50వేల నగదు బహుమతిని అందుకున్నారు.

